

విశాఖలో ఆయుధాలు స్వాధీనం

- ట్రావెల్ ఏజెన్సీలో పనిచేస్తున్న వ్యక్తి నుంచి రివాల్వర్, పిస్టల్, రెండు బుల్లెట్స్ సీజ్

... వివరాలు మెయిన్ 3వ పేజీలో



పోలీసులు సీజ్ చేసిన ఆయుధాలు

అరకులోయ ఎంపీ అభ్యర్థి కొత్తపల్లి గీత

ప్రకటించిన బీజేపీ అధిష్ఠానం

- పాడేరు అసెంబ్లీకి ఉమామహేశ్వరరావును ఖరారు చేసే అవకాశం

(పాడేరు- ఆంధ్రజ్యోతి)

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తులో భాగంగా అరకులోయ పార్లమెంట్, పాడేరు అసెంబ్లీ స్థానాలను బీజేపీకి కేటాయించడంతో ఆ పార్టీ అధిష్ఠానం అభ్యర్థులను ఖరారు చేసేందుకు కసరత్తు చేసింది. అరకులోయ ఎంపీ అభ్యర్థిగా కొత్తపల్లి గీతను ఖరారు చేసింది. ఆదివారం రాత్రి ఈ మేరకు జాబితాను విడుదల చేసింది. కాగా పాడేరు అసెంబ్లీ అభ్యర్థిగా కురుసా ఉమామహేశ్వరరావును బరిలో దింపుతున్నట్టు సమాచారం.



కొత్తపల్లి గీత



కురుసా ఉమామహేశ్వరరావు

కొత్తపల్లి గీత రాజకీయ ప్రస్థానం

మాజీ ఎంపీ కొత్తపల్లి గీత 2014 నుంచి 2019 నుంచి అరకులోయ ఎంపీగా ఈ ప్రాంతానికి సుపరిచితురాలు కావడంతోనే తాజాగా తమ అభ్యర్థిగా బీజేపీ ఎంపిక చేసింది. తూర్పుగోదావరి జిల్లా తిమ్మాపురం గ్రామానికి చెందిన కొత్తపల్లి గీత ఎంఏ వరకు విద్యను అభ్యసించి గ్రూప్- 1 అధికారిగా సేవలందించారు. ఆమెకు రాజకీయాల పట్ల ఆసక్తి ఉండడంతో గ్రూప్- 1 ఉద్యోగాన్ని సైతం వదిలేసి 2013లో వైసీపీలో చేరారు. 2014లో ఆమె అరకులోయ ఎంపీ అభ్యర్థిగా బరిలో దిగి విజయం సాధించారు. ఎంపీగా కొనసాగుతూనే 2018లో స్వయంగా జనజాగృతి పేరిట ఆమె రాజకీయ పార్టీని ఏర్పాటు చేసి 2019లో దానిని బీజేపీలో విలీనం చేశారు. అప్పటి నుంచి ఆమె బీజేపీ నేతగా కొనసాగుతున్నారు. ఈ తరుణంలో 2023 ఆగస్టులో కొత్తపల్లి గీత బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా నియమితులయ్యారు. అరకులోయ ఎంపీ స్థానం నుంచి పోటీ చేయాలనే లక్ష్యంతో ఉన్న ఆమెకు ఆ సీటు దక్కింది.

పాడేరు అసెంబ్లీ అభ్యర్థి ఖరారు!

పాడేరు అసెంబ్లీ స్థానం నుంచి బీజేపీ సీనియర్ నేత, గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కురుసా ఉమామహేశ్వరరావును ఆ పార్టీ అధిష్ఠానం బరిలో దింపుతున్నట్టు తెలిసింది. మూడు వారాల క్రితం వరకు పాడేరు అసెంబ్లీ స్థానం టీడీపీకి కేటాయిస్తారనుకున్నప్పటికీ, కూటమి పొత్తులో భాగంగా బీజేపీకి దక్కింది. దీంతో గతవారం రోజులుగా తమ అభ్యర్థిగా ఎవర్ని బరిలో దింపాలనే దానిపై బీజేపీ కసరత్తు చేసింది. ఆఖరికి బీజేపీ నేత ఉమామహేశ్వరరావును ఖరారు చేసినట్టు సమాచారం. బీజేపీ అగ్ర నేతలైన వెంకయ్యానాయుడు, పీవీ చలపతిరావు, కంభంపాటి హరిబాబు వంటి వారితో కలిసి బీజేపీలో పని చేసిన కొత్తపాడేరు గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ నేత కురుసా బొజ్జయ్య తనయుడే ఉమామహేశ్వరరావు. ఆయనకు సైతం రాజకీయాల పట్ల ఆసక్తి ఉండడంతో తండ్రి వారసత్వాన్ని కొనసాగిస్తూ గత 25 ఏళ్లుగా పంచాయతీ మొదలుకుని పార్లమెంట్ స్థానం వరకు భారతీయ జనతా పార్టీలో వివిధ హోదాల్లో పని చేశారు. ప్రస్తుతం ఆయన బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడిగా, కేంద్ర కాఫీ బోర్డు డైరెక్టర్‌గా పని చేస్తున్నారు.

అనకాపల్లి ఎంపీ అభ్యర్థిగా సీఎం రమేశ్

అనకాపల్లి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి లోక్‌సభ స్థానం నుంచి కూటమి అభ్యర్థిగా ఎవరు పోటీ చేస్తారన్న ఉత్కంఠకు తెరపడింది. పొత్తులో భాగంగా భారతీయ జనతా పార్టీకి కేటాయించిన ఈ నియోజకవర్గం నుంచి రాజ్యసభ సభ్యుడు, సీనియర్ నేత సీఎం రమేశ్ పోటీ చేయనున్నారు. ఈ మేరకు బీజేపీ కేంద్ర నాయకత్వం ఆదివారం అనకాపల్లి ఎంపీ అభ్యర్థిగా సీఎం రమేశ్ పేరును ప్రకటించింది.



సీఎం రమేశ్, బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి

టీడీపీతో రాజకీయ ప్రస్థానం

కడప జిల్లా పోట్లదుర్తి గ్రామంలో మునిస్వామినాయుడు, రత్నమ్మ దంపతులకు 1965 జూన్ 12న సీఎం రమేశ్ జన్మించారు. ఆయనకు భార్య సీఆర్ శ్రీదేవి, కుమారుడు రిత్విక్, కుమార్తె రిత్విన్ ఉన్నారు. రిత్విక్ ప్రాజెక్ట్స్ పేరుతో వ్యాపార రంగంలో ఉన్న సీఎం రమేశ్. 1997లో తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు పిలుపునందుకొని టీడీపీలో చేరారు. టీడీపీ చిత్తూరు జిల్లా ప్రచార కార్యదర్శిగా ... మిగతా 8వ పేజీలో

హోలీకి బీటాలైన్ ముస్తాబు

గిరిజన సంప్రదాయబద్ధంగా వేడుకలు

- రాధాకృష్ణ ఆలయంలో ప్రత్యేక పూజలు
- 60 అడుగుల కర్రల పోగు ఏర్పాటు
- భక్తుల సమక్షంలో నేడు దహనం చేయనున్న నిర్వాహకులు

చింపతల్లి, మార్చి 24: హోలీ వేడుకలకు మండలంలోని తాజంగి పంచాయతీ కేంద్రం బీటాలైన్ ముస్తాబైంది. ఆదివాసీలు ప్రతీ ఏడాది సంప్రదాయబద్ధంగా హోలీకి ముందురోజు నుంచి స్థానిక రాధాకృష్ణ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి సంబరాలు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్నది. హోలీని పురస్కరించుకుని నిర్వాహకులు, భక్తులు ఆలయం ఎదుట 60 అడుగుల ఎత్తులో నిర్మించిన కర్రల పోగును దహనం చేస్తారు. ఈ వేడుకలో స్వయంగా పాల్గొనేందుకు పలు గిరిజన గ్రామాలు, మైదాన ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తారు. తాజంగి పంచాయతీ బీటాలైన్‌లో ఒడిశా నుంచి వలస వచ్చిన 300 కుటుంబాల ఆదివాసీలు సుమారు 85 ఏళ్లగా స్థానికంగా నివాసముంటున్నారు. స్థానిక గిరిజనులు గ్రామంలో రాధాకృష్ణ ఆలయాన్ని నిర్మించుకుని ప్రతి ఏటా హోలీ రోజున పండగ జరుపుకుంటున్నారు. ఆరేళ్ల కిందట ఆలయాన్ని ఆధునికీకరించారు. అయితే బీటాలైన్ ఆదివాసీలు విభిన్నంగా జరుపుకునే హోలీ వేడుక పూర్వం నుంచి కొనసాగుతున్నది. ఈ ఏడాది హోలీ వేడుకలకు రాధాకృష్ణ ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. ఆదివారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు జరిగాయి. మరుసటి రోజు సాయంత్రం వరకు ఆలయంలో పూజలు, అభిషేకాలు, అర్చనలు జరుగుతాయి.



సోమవారం తెల్లవారుజామున దహనం చేసేందుకు ఏర్పాటు చేసిన 60 అడుగుల కర్రల పోగు



రాధాకృష్ణ ఆలయం

60 అడుగుల ఎత్తులో కర్రల పోగు

ప్రతి ఏడాది మాదిరిగా ఈ ఏడాది కూడా కర్రల పోగును దహనం చేయడానికి ఏర్పాటు చేశారు. ఇప్పటికే స్థానిక భక్తులు 60 అడుగుల కర్రల పోగును సిద్ధం చేశారు. ఈ కర్రల పోగును సోమవారం ఉదయం నాలుగు గంటలకు కాలుస్తారు. ఈ కర్రల పోగుపైన ఒక జెండాను ఎగురవేస్తారు. ఈ జెండాను పట్టుకోవడానికి కర్రల పోగు చుట్టూ యువకులు నిరీక్షిస్తుంటారు. కర్రల పోగు కాలిపోయి జెండా గాలిలోకి ఎగురుతుంది. ఈ జెండాను పట్టుకున్న వ్యక్తిని భక్తులందరూ ఎత్తుకుని అతని గృహం వరకు గిరిజన సంప్రదాయ నృత కళా ప్రదర్శనలతో తీసుకొస్తారు. జెండాను పట్టుకున్న వ్యక్తికి ఆలయ కమిటీ నగదు బహుమతిగా రూ.1116 అందజేయనున్నట్టు కమిటీ సభ్యులు ప్రకటించారు. ఈ జెండాను పట్టుకున్న కుటుంబానికి ఏడాదంతా శుభం జరుగుతుందని స్థానిక భక్తుల నమ్మకం. ఈ ప్రాంత గిరిజనులందరూ ఈ జెండా పట్టుకున్న వ్యక్తితోనే రానున్న ఖరీఫ్ సీజన్‌లో సాగు కోసం తొలి విత్తనాల నాట్లు వేయిస్తారు. ఇలా చేస్తే అధిక దిగుబడులు వస్తాయనేది ఆదివాసీల విశ్వాసం.

చైతన్యం పెరగడంతో పాత ఆచారానికి స్వస్తి

బీటాలైన్‌లో ప్రతి ఏటా జరిగే హోలీకి మరో ప్రత్యేకత వుంది. సుమారు 20 ఏళ్ల కిందట హోలీ పండగ సమయంలో ఇష్టమైన అమ్మాయి చేయి పట్టుకుని గృహానికి తీసుకుని వెళితే వారిద్దరికీ వివాహమైనట్టుగానే గిరిజనులు భావించేవారు. ప్రతి ఏటా ఈ హోలీ పండగ సమయంలో సుమారు 20 నుంచి 30 జంటలు చేయిపట్టుకునే పద్ధతిలో కలిసేవారని స్థానికులు చెబుతున్నారు. ప్రస్తుతం మహిళా చట్టాలపై ప్రజల్లో చైతన్యం పెరగడం, చట్టాలను మరింత కఠినతరం చేయడంతో ఈ చేయిపట్టుకుని తీసుకు వెళ్లే ఆచారానికి స్థానిక గిరిజన యువత పూర్తిగా స్వస్తి పలికారు.

అవయవదాతల కోసం ఎదురుచూపులు



ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంటేషన్ కోసం వేలాది మంది నిరీక్షణ

- రిజిస్ట్రేషన్లకు అనుగుణంగా పెరగని దాతల సంఖ్య
- రోగులకు తప్పని ఇబ్బందులు
- జీవన్‌ధాన్‌లో 3,409 మంది రిజిస్ట్రేషన్
- లివర్‌కు 1,010, కిడ్నీకి 2,325, హార్ట్‌కు 62, లంగ్స్ కోసం 12 మంది దరఖాస్తులు
- రాష్ట్ర వ్యాప్తంగా తొమ్మిదేళ్లలో 3,343 మంది రోగులకు అవయవ మార్పిడి

(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో అవయమార్పిడి కోసం ఎదురుచూస్తున్న రోగుల సంఖ్య క్రమేణా పెరుగుతోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా అవయవాల కోసం దరఖాస్తు (రిజిస్ట్రేషన్) చేయించుకుం టున్న వారి సంఖ్య రెట్టింపవుతోంది. ఏటా పదుల సంఖ్యలో రోగులు ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంటేషన్ కోసం జీవన్‌ధాన్‌లో దరఖాస్తు చేసుకుంటున్నారు. రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్న వారి సంఖ్యకు అనుగుణంగా అవయవాల లభ్యత లేకపోవడంతో రోగులకు నిరీక్షణ తప్పడం లేదు. అవయవ మార్పిడికి అవకాశం లేకపోవడంతో దీర్ఘకాలిక వైద్యమే శరణ్యమవుతోంది. అంతేకాక సకాలంలో మార్పిడి జరగక ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా కిడ్నీ, లివర్, గుండె సంబంధిత వ్యాధులు బారినపడుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. వీరిలో చాలా మందికి అవయవ మార్పిడి శస్త్రచికిత్స అవసరం. ఈ విధా నాన్ని పర్యవేక్షిస్తున్న జీవన్‌ధాన్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్న రోగుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ఏటా సుమారు 200 మంది రోగులు దరఖాస్తు చేస్తున్నారంటే పరిస్థితి ఏస్థాయిలో ఉందో తెలుస్తోంది. ఆయా వ్యాధుల బారినపడుతున్న వారిలో రెండు నుంచి మూడు శాతం మందికి మాత్రమే అవయవ మార్పిడి అవసరం ఏర్పడుతోంది. అయినప్పటికీ పదుల సంఖ్యలో దరఖాస్తులు రావడం వ్యాధుల తీవ్రతకు అద్దం పడుతోందని నిపుణులు చెబుతున్నారు.

పెరుగుతున్న కిడ్నీ, లివర్ బాధితులు..

కిడ్నీ, లివర్ వ్యాధుల బారినపడుతున్న వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. గతంలో ఎన్నడూ లేని విధంగా చిన్న వయసులోనే ... మిగతా 8వ పేజీలో



దరఖాస్తులు పెరిగాయి

అవయవాల కోసం దరఖాస్తు చేసుకుంటున్న వారి సంఖ్య పెరుగుతోంది. గతంలో ఏటా పది నుంచి 20 దరఖాస్తులు వస్తుండేవి. ఇప్పుడు ఆ సంఖ్య పెరిగింది. అందుకు అను గుణంగా దాతల సంఖ్య పెరగడం సానుకూల అంశం. అవయవదానంపై ప్రజల్లో మరింత అవగాహన రావాలి. అప్పుడే ఏళ్లుగా ఎదురు చూస్తున్న దీర్ఘకాలిక రోగులకు మేలు చేకూర్చేందుకు అవకాశం ఉంటుంది. గత రెండు నెలల్లో 30 మందికి అవయవ మార్పిడి శస్త్రచికిత్సలు నిర్వహించాం. గతంలో ఎన్నడూ ఈ స్థాయిలో చేసిన దాఖలాలు లేవు.

- డాక్టర్ కె.రాంబాబు, జీవన్‌ధాన్ కో-ఆర్డినేటర్



బంగారుమెట్ట వద్ద చెట్ల కింద కూర్చొని ఉపశమనం పొందుతున్న ఉపాధి కూలీలు

మండుటెండలో అవస్థలు

- ఉపాధి పని ప్రదేశాల్లో కనీస సదుపాయాలు శూన్యం
- కూలీలకు తప్పని ఇబ్బందులు

పెదబయలు, మార్చి 24: మండలంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు జోరుగా సాగుతున్నాయి. ప్రస్తుతం ఎండలు తారెత్తిస్తున్న నేపథ్యంలో కనీస సదుపాయాలు లేక ఉపాధి కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. టెంట్లు, మంచినీటి సదుపాయం లేక అల్లాడిపోతున్నారు. మండలంలోని 23 పంచాయ తీల్లో గల పలు గ్రామాల్లో ఉపాధి హామీ పనులు జరుగుతున్నాయి. భూమి చదును, మొక్కలు నాటడానికి గోతులు తీయడం, చెరువులు తవ్వడం, రాతి కట్టు వంటి పనులు జోరుగా సాగుతున్నాయి. అయితే ఆదివారం సీకరి పంచాయతీ బంగారుమెట్ట గ్రామంలో జరుగుతున్న ఉపాధి పని ప్రదేశంలో ఎటువంటి సదుపాయం లేకపోవడంతో తారెత్తిస్తున్న ఎండ నుంచి రక్షణ పొందడానికి కూలీలు చెట్ల కింద కొంత సేపు సేదతీరారు. పని ప్రదేశంలో టెంట్లు, తాగునీరు, ప్రథమ చికిత్స కిట్లు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని కూలీలు వాపోయారు.

గతంలో పారలు, గునపాలు వంటి పనిముట్లను ప్రభుత్వం సరఫరా చేసేదని, ఇప్పుడు అవి కూడా అందించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ఉపాధి పని జరిగే ప్రదేశాలలో మౌలిక సదుపాయాలు కల్పించి, పని ముట్లు సరఫరా చేయాలని వారు కోరుతున్నారు.

అపరిచితుల హల్‌చల్

- ముంచంగిపుట్టులో కొద్ది రోజులుగా సంచారం
- గిరి గ్రామాల్లో రాత్రి వేళల్లో యువకుల పహారా

- వార్త 8వ పేజీలో..

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (సోమ)	6.12
సహరి (మంగళ)	4.43


పర్యాటక ప్రాంతాలు వెలవెల

మన్యంలో కానరాని సందర్శకుల సందడి

- పొగమంచు తగ్గడం, విద్యార్థులకు వార్షిక పరీక్షలే కారణం

(ఆంధ్రజ్యోతి- పాడేరు)

మన్యంలోని సందర్శనీయ ప్రాంతాల్లో ఆదివారం పర్యాటకుల సందడి తగ్గింది. వాతావరణంలోని మార్పులతో ఏజెన్సీలో పొగమంచు ప్రభావం తగ్గిపోవడంతో పాటు ప్రస్తుతం విద్యార్థులకు వార్షిక పరీక్షలు జరుగుతుండడంతో జనం ఇళ్లకే పరిమితమయ్యారు. దీంతో అనంతగిరి మండలం బొర్రా గుహలు మొదలుకుని చింతపల్లి మండలం లంబసింగి వరకు పర్యాటకుల సందడి తగ్గింది. అనంతగిరి మండలం బొర్రా గుహలు, కటికి, తాడిగుడ జలపాతాలు, అరకులోయ మండలంలో మాడగడ మేఘాల కొండ, గిరిజన మ్యూజియం, పద్మాపురం గార్డెన్, కొత్తవలస వ్యవసాయ క్షేత్రం, పెదలబుడు గిరిజన గ్రామదర్శిని, డుంబ్రిగుడ మండలంలోని చాపరాయిగెడ్డ, పెదబయలు మండలంలో తారాబు జలపాతం, పాడేరు మోదకొండమ్మ ఆలయం, వంజంగి హిల్స్, జి.మాడుగుల మండలంలోని కొత్తపల్లి జలపాతం, చింతపల్లి మండలంలో తాజంగి, చెరువువేనం, లంబసింగి ప్రాంతాల్లో పర్యాటకుల సందడి కానరాలేదు.



బోసిపోయిన చాపరాయి పర్యాటక కేంద్రం



నిర్మానుష్యంగా కనిపిస్తున్న చెరువులవేనం వ్యూపాయింట్

బోసిపోయిన చెరువులవేనం

చింతపల్లి: ఆంధ్ర కశ్మీర్ లంబసింగి, పరిసర పర్యాటక ప్రాంతాలు ఆదివారం సందర్శకులు లేక బోసిపోయాయి. వేసవిలోనూ చెరువులవేనం మంచు అందాలు ఆలరిస్తున్నప్పటికి పర్యాటకులు సందర్శించడం లేదు. ప్రస్తుతం విద్యార్థులకు పరీక్షలు జరుగుతుండడంతో సందర్శకుల సంఖ్య పూర్తిగా తగ్గిపోయింది. దీంతో తాజంగి జలాశయం, చెరువులవేనం నిర్మానుష్యంగా దర్శనమిచ్చాయి.

వెలవెలబోయిన చాపరాయి

డుంబ్రిగుడ: మండలంలోని పర్యాటక కేంద్రం చాపరాయి జలపాతం ఆదివారం పర్యాటకులు లేక బోసిపోయింది. ఎండలు తారెత్తిస్తుండడం, విద్యార్థులకు వార్షిక పరీక్షల నేపథ్యంలో ఇక్కడ సందడి కనిపించలేదు. వ్యాపారాలు లేక చిరు వర్తకులు డీలా పడ్డారు.

క్రైం... crime news

కోడి పందాల శిబిరంపై దాడి : ఐదుగురి అరెస్టు

▸ రెండు పందెం కోళ్లు, రూ. 1,230 నగదు స్వాధీనం

ఎస్. రాయవరం, మార్చి 24: మండలంలోని కోనవానిపాలెం గ్రామ శివారులో ఉన్న చెరువు వద్ద నిర్వహిస్తున్న కోడి పందాల శిబిరంపై ఆదివారం దాడులు నిర్వహించి, ఐదుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్టు ఎస్ఐ విభీషణరావు తెలిపారు. ఈ సందర్భంగా రెండు పందెం కోళ్లు, రూ 1,230 నగదును స్వాధీనం చేసుకున్నట్టు ఆయన చెప్పారు. కోడి పందాలు జరుగుతున్నట్టు అందిన సమాచారం మేరకు దాడి చేశామన్నారు. పట్టుబడిన వ్యక్తులపై కేసు నమోదుచేసి, కోళ్లు, నగదును సీజ్ చేశామన్నారు.

నలుగురి అరెస్టు...

అచ్యుతాపురం, మార్చి 24: ఎర్రవరంలో కోడిపందెలు నిర్వహిస్తున్న నలుగురిని అదుపులోకి తీసుకున్నామని ఎస్ఐ నారాయణరావు తెలిపారు. ఎర్రవరం కొండపక్కన కోడి పందెలు జరుగుతున్నాయని అందిన సమాచారం మేరకు దాడి చేసి మూడు కోడి పుంజులు, రూ.15వేలు నగదు స్వాధీనం చేసుకున్నామని ఆయన తెలిపారు. ఇదిలా ఉండగా ఎర్రవరం కొండ వద్ద గుట్టు చప్పుడు కాకుండా ప్రతి ఆదివారం కోడిపందాలు జరుగుతున్నాయని గ్రామస్థులు తెలిపారు. పార్టీలకతీతంగా నాయకులు కోడి పందెలు నిర్వహిస్తున్నారని వారు తెలిపారు.

12 మద్యం సీసాలతో ఒకరిపై కేసు నమోదు

ఎలమంచిలి, మార్చి 24: స్థానిక పీటీడీ బస్టాండ్ సమీపంలో 12 మద్యం సీసాలతో ఉన్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్టు పట్టణ ఎస్ఐ పాపినాయుడు తెలిపారు. కట్టుపాలెం గ్రామానికి చెందిన పి.రాంబాబు అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

కుంచంగిలో 9 మద్యం సీసాలతో మహిళపై..

కొత్తూరు, మార్చి 24: అక్రమంగా మద్యం సీసాలు తరలిస్తున్న మహిళను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశామని అనకాపల్లి రూరల్ స్టేషన్ ఏఎస్ఐ సింగంపల్లి భాస్కరరావు తెలిపారు. సాధారణ తనిఖీల్లో భాగంగా ఆదివారం కుంచంగి గ్రామంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా అదే గ్రామానికి చెందిన జామి నాగమణిని తనిఖీ చేయగా 9 మద్యం క్వార్టర్ సీసాలు లభ్యమయ్యాయన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని అయన చెప్పారు.

12 మద్యం సీసాలతో మరొకరిపై..

అనకాపల్లి టౌన్, మార్చి 24 : స్థానిక సుంకరమెట్ట జంక్షన్ వద్ద అనకాపల్లిలో మద్యం కొనుగోలు చేసి తీసుకువెళ్తున్న వ్యక్తి నుంచి 12 మద్యం క్వార్టర్ సీసాలను స్వాధీనం చేసుకున్నామని పట్టణ హెడ్‌కానిస్టేబుల్ శ్రీను తెలిపారు. రాయుడుపేటకు చెందిన కొలుసు లక్ష్మణరావు పట్టణంలోని మద్యం దుకాణాల నుంచి మద్యం బాటిళ్లు కొనుగోలు చేసి సంచిలో తీసుకువెళుతుండగా తనిఖీ చేశామని, ఈ సందర్భంగా 12 మద్యం సీసాలు లభ్యమయ్యాయన్నారు. అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని శ్రీను తెలిపారు.

కొత్త అమావాస్య జాతర చాటింపు ప్రారంభం


కొత్తఅమావాస్య జాతర చాటింపు ప్రారంభించిన దృశ్యం

అనకాపల్లి టౌన్, మార్చి 24: ఉత్తరాంధ్ర ఇలవేల్పు నూకాంబిక కొత్త అమావాస్య జాతర చాటింపు ఆదివారం రాత్రి ప్రారంభమైంది. ముందుగా బాలాలయంలో ఘటాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండుగ చాటింపు పట్టణ వీధుల గుండా సాగింది. ఈ కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్ బండారు ప్రసాద్, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా అనంతుని రథోత్సవం

▸ వేలాదిగా పాల్గొన్న భక్తులు
▸ ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

పద్మనాభం, మార్చి 24: పద్మనాభంలోని అనంత పద్మనాభుని రథోత్సవం ఆదివారం రాత్రి అత్యంత వైభవంగా జరిగింది. ఏటా ఫాల్గుణ ఏకాదశి నుంచి జరిగే అనంతుని కల్యాణోత్సవాల్లో భాగంగా చతుర్దశితో కూడిన పౌర్ణమి రోజున రథోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఈమేరకు ఉత్సవంలో భాగంగా ముందుగా నిత్య హోమం, రథాంగ హోమం, మహాశాంతి హోమం, గ్రామ బలిహరణ అనంతరం వైదిక సదస్సు నిర్వహించారు. సాయంత్రం కృష్ణాపురం, మద్ది, పద్మనాభం, ఇసకలపాలెం, అర్చకునిపాలెం గ్రామాలకు చెందిన ముఖ్య కుటుంబీకులు రథాన్ని ఊరేగించడానికి తీసుకువచ్చిన తాళ్లను రథానికి కట్టి, రథ చక్రాలకు పూజలు నిర్వహించి, ఊరేగింపునకు సిద్ధం చేశారు. ఉత్సవానికి ముందు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు కుంతీమాధవస్వామిని దర్శించుకొని పూజలు చేశారు. లక్ష్మీ సన్నిధి సమీపంలో మహిళలు దీపాలంకరణ చేశారు. అనంతరం వేద పండితుల వేద పఠనం, విశేష పూజలు తరువాత శ్రీదేవి, భూదేవి సమేత అనంతుని ఉత్సవ విగ్రహాలను మంగళ వాయిద్యాల నడుమ వేదమంత్రోచ్చారణలతో ఊరేగింపుగా తీసుకువచ్చి రథంపై నిలిపారు. ఆలయ సంప్రదాయం ప్రకారం పద్మనాభం పోలీసు స్టేషన్ సీఐ శ్రీధర్‌ను దేవస్థానం ఈఓ నానాజీబాబు ఆధ్వర్యంలో ఆహ్వానించి ప్రథమ పూజ నిర్వహించారు. రథోత్సవంలో ప్రధాన భాగస్వాములైన సుంకర, సురాల, మొకర, కనకల, తాలాడ కుటుంబాలకు చెందిన వారితో పూజలు చేయించారు. భక్తులందరూ గోవింద నామస్మరణతో మార్మోగగా రథాన్ని పద్మనాభంలోని రాజవీధి మీదుగా ఊరేగింపుగా తీసుకు వెళ్లారు. తిరువీధిలో దారి పొడవునా భక్తుల నీరాజనాల నడుమ అనంతుడు ప్రత్యేక పూజలు అందుకున్నారు. అర్ధ రాత్రి దాటిన తరువాత రథం తిరిగి ఆలయం వద్దకు చేరుకోవడంతో ఉత్సవం ముగిసింది. రథోత్సవం సందర్భంగా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో దాతల సహకారంతో భారీ అన్నదానం నిర్వహించారు. అలాగే త్రి రత్నాలు పేరుతో పౌరాణిక నాటక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు.

నేడు అప్పన్న డోలోత్సవం


ముస్తాబైన ఉద్యానవన మండపం

సింహాచలం, మార్చి 24: వరాహ లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో జరిగే వార్షికోత్సవాల్లో భాగంగా సోమవారం డోలోత్సవం నిర్వహించనున్నారు. ఈమేరకు దేవస్థానం అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఉత్సవ మూర్తి గోవిందరాజస్వామిని ఉదయం 6.30 గంటలకు మెట్ల మార్గంలో పల్లకీలో బోయీలు కొండ దిగువకు తీసుకు వస్తారు. తొలిపావంచా వద్ద గ్రామస్తులు, భక్తుల స్వాగతం తరువాత స్వామివారు నేరుగా అడివివరం గ్రామ దేవత, సోదరి పైడితల్లెమ్మ ఆలయానికి చేరుకుంటారు. అక్కడ అమ్మవారికి పసుపు కుంకుమలిచ్చి తనకు ఆమె కుమార్తె శ్రీ మహాలక్ష్మీ అమ్మవారితో వివాహానికి సంబంధం కుర్చుకుంటారు. అక్కడి నుంచి పురాతన ఉద్యానవన మండపానికి చేరుకుని డోలోత్సవం జరుపుకుంటారు. వసంతోత్సవం, చూర్ణోత్సవం చేసుకుని కొండ దిగువ మాడవీధుల్లో తిరువీధి అనంతరం తిరిగి మెట్ల మార్గంలో సింహగిరికి చేరుకోవడంతో డోలోత్సవం పూర్తవుతుంది. కాగా గ్రామీణ ఆచారం ప్రకారం పైడితల్లెమ్మ కుమార్తెతో వివాహానికి స్వామి మాటాలకు వస్తాడని అందుకే ఈ ఉత్సవాన్ని బొట్టిన దుగు పున్నమిగా స్థానికులు వ్యవహరిస్తారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	107.00
లైవ్ ధర	127.00
విత్ స్కిన్	224.00
స్కిన్ లెస్	234.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	415
విజయనగరం	419
శ్రీకాకుళం	419

నెలల తర'బడి' ఇంతే..!!


వజ్రగడ హైస్కూల్‌లో మొండి గోడలతో దర్శనమిస్తున్న భవనం

మూడు పాఠశాలల్లో రెండేళ్ల క్రితం 'నాడు- నేడు' పనులు ప్రారంభం

▸ మధ్యలో అసంపూర్తిగా నిలిచిన నిర్మాణాలు
▸ ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు
▸ పట్టించుకోని విద్యాశాఖ అధికారులు

మాకవరపాలెం, మార్చి 24:
'నాడు- నేడు పథకం కింద ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చేశాం. విద్యారంగంలో నూతన ఒరవడిని సృష్టించేశాం' ఇదీ గత ఐదేళ్లుగా ముఖ్యమంత్రి నుంచి మంత్రులు, అధికార పార్టీకి చెందిన ఇతర ప్రజాప్రతినిధులు సమావేశాల్లోనూ, బహిరంగ సభల్లోనూ తరచూ చేసే ప్రసంగాలు. అయితే చాలాచోట్ల వీరు చెప్పే మాటలకు, క్షేత్ర స్థాయిలో జరిగే పనులకు పొంతన లేదని ఆయా గ్రామాల ప్రజలే వేలెత్తి చూపుతున్నారు. ఇందుకు మాకవరపాలెం మండలంలోని పలు పాఠశాలల్లో పనులను ఉదహరిస్తున్నారు.

మండలంలోని వజ్రగడ, గిడుతూరు, జి.కోడూరు గ్రామాల్లోని మూడు హైస్కూళ్లలో అదనపు తరగతి గదుల నిర్మాణాలకు నాడు- నేడు పథకంలో భాగంగా సుమారు కోటి రూపాయలతో నిర్మాణాలను ప్రారంభించారు. ఆయా పనులు చేపట్టేవారు ముందుగా మెటీరియల్ కొనుగోలు చేసి, బిల్లులు అప్‌లోడ్ చేస్తే ప్రభుత్వం నిధులను విడుదల చేస్తుంది. ఇక్కడ పనులను ప్రారంభించేకాంట్రాక్టర్లు ఆ ప్రకారం నిధులు పొందారు. కానీ రెండేళ్లుగా ఈ హైస్కూళ్లలో భవన నిర్మాణ పనులు ఆ స్థాయిలో ముందుకు సాగలేదు. నేటికీ ఈ మూడు హైస్కూళ్లలో పనులు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి.


గిడుతూరు హైస్కూల్‌లో శ్లాబ్‌కు సిద్ధం చేసి నిలిపివేసిన పనులు

వజ్రగడ హైస్కూల్‌లో ప్రస్తుతం ఉన్న భవనంపైన రెండు గదులకుగాను సుమారు రూ.30,85,517లతో పనులు ప్రారంభించారు. బిల్లు కూడా రూ.30,77,752 అప్‌లోడ్ చేశారు. అయితే రెండేళ్ల నుంచి హైస్కూల్ ఆవరణలోనే భవన నిర్మాణ సామగ్రి పడిఉంది తప్ప, పనులు వేగవంతం కాలేదు. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే, గిడుతూరు హైస్కూల్‌లో ఒక భవనం నిర్మాణానికి రూ.17,66,922తో పనులు ప్రారంభించారు. ప్రస్తుతం రూ.13,17,609 బిల్లులు అప్‌లోడు చేశారు. అయితే నేటికీ పనులు పూర్తికాక పోడంతో మిగిలిన నాలుగు లక్షల రూపాయలను ప్రభుత్వం వెనక్కి తీసుకుందని అధికారులు చెబుతున్నారు. అదేవిధంగా జి.కోడూరు హైస్కూల్‌లో నూతన భవనాల నిర్మాణానికి రూ.31,70,412తో పనులు ప్రారంభించారు. ఇంత వరకూ రూ.28,45,341 బిల్లులు అప్‌లోడు చేశారు. మిగిలిన పనులు చేయకపోవడంతో మూడు లక్షల రూపాయలను ప్రభుత్వం వెనక్కి తీసుకుంది. దీనికి తోడు కోడూరు హైస్కూల్‌లో సిమెంట్ బస్తాలు కూడా గడ్డ గట్టి ఉన్నాయి. వీటిని అధికారులు పట్టించుకోలేదు. ఈ నిర్మాణ పనుల్లో తీవ్ర జాప్యం వహిస్తున్నా మండల విద్యాశాఖ అధికారులు పట్టించుకోక పోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పాఠశాలల్లో అదనపు భవనాలు నిర్మిస్తే సౌకర్యవంతంగా ఉంటాయని ఇటు విద్యార్థులు, అటు వారి తల్లిదండ్రులు సంబరపడినా వారి ఆశలు మాత్రం నెరవేరడం లేదు. కనీసం రానున్న కొత్త విద్యా సంవత్సరం ఆరంభం నాటికైనా నిర్మాణ పనులు పూర్తిచేసి ఆయా భవనాలను విద్యార్థులకు అందుబాటులోకి తేవాలని అంతా కోరుతున్నారు. దీనిపై ఎంఈవో-2 మూర్తిని వివరణ కోరగా, గిడుతూరు, జి.కోడూరు హైస్కూళ్లలో నిర్మాణాలకు నిధుల కొరత ఉందన్నారు. వజ్రగడ హైస్కూల్ భవ నిర్మాణాలు చేసేందుకు అక్కడున్న కమిటీ ముందుకు రాకపోవడతో పనులు నిలిచిపోయాయని తెలిపారు. ఈ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లినట్టు చెప్పారు.


వజ్రగడ పాఠశాల ఆవరణలో వృథాగా పడి ఉన్న మెటీరియల్

రాజాధిరాజ వాహనంపై కల్యాణ వేంకటేశ్వరుడు

నక్కపల్లి, మార్చి 24: మండలంలోని ఉపమాక క్షేత్రంలో స్వామివారి వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం రాజాధిరాజ వాహనంపై స్వామివారి తిరువీధి సేవ, తోట ఉత్సవం జరిగింది. ఆలయానికి 2 కిలోమీటర్ల దూరంలో సీహెచ్ఎల్‌పురం వద్ద వున్న స్వామివారి తోటకు రాజాధిరాజ వాహనంపై స్వామివారిని అలంకరించి తీసుకెళ్లారు. అక్కడ వున్న రాతి కల్యాణ మండపంపై పూజా కార్యక్రమాలు చేసి, ప్రసాదాలు పంపిణీ చేశారు. తదుపరి రాత్రి మాడవీధుల్లో తిరువీధి సేవ జరిగింది. ఆదివారం కూడా ఉపమాక వెంకన్న ఆలయాన్ని రికార్డు స్థాయిలో భక్తులు దర్శించుకున్నారు. ఆలయంలో వున్న క్యూ లైన్లన్నీ భక్తులతో నిండిపోయాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి నిర్వహించిన పండిత సభ విశేషంగా ఆలరించింది. తోట ఉత్సవంలో భాగంగా ఆలయ ప్రధానార్చకులు గొట్టుముక్కల ప్రసాదాచార్యులు, అర్చకులు సంకర్షణపల్లి కృష్ణమాచార్యులు, పీసపాటి శేషాచార్యులు, భాగవతం సాయి గోపాలాచార్యులు, నండూరి రాజగోపాలాచార్యులు పూజా కార్యక్రమాలు చేశారు.


రాజాధిరాజ వాహనంపై కల్యాణ వేంకటేశ్వరుడిని తోట ఉత్సవానికి ఊరేగింపుగా తీసుకెళ్తున్న దృశ్యం

నూకాంబిక అమ్మవారి పునఃదర్శనం ప్రారంభం


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

అనకాపల్లి టౌన్, మార్చి 24: స్థానిక నూకాంబిక అమ్మవారి పునఃదర్శనం ఆదివారం ప్రారంభమైంది. కొత్త అమావాస్య జాతర సందర్భంగా అమ్మవారి విగ్రహానికి రంగులు వేసే కార్యక్రమంలో భాగంగా గురు, శుక్ర, శనివారాల్లో దర్శనాన్ని నిలిపివేసిన సంగతి తెలిసిందే. ఆదివారం తెల్లవారుజామున అమ్మవారికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు దర్శనం కల్పించారు. ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో కుటుంబసమేతంగా వంటలు తయారుచేసి అమ్మవారికి నైవేద్యం పెట్టి మొక్కులు తీర్చుకున్నారు.

మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు టీడీపీలో చేరిక

▸ కండువా కప్పి ఆహ్వానించిన చంద్రబాబు

కె.కోటపాడు, మార్చి 24: మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పాల్తేటి పెంటారావు శనివారం తెలుగుదేశం పార్టీలో చేరారు. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో అతనితోపాటు రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు నక్కలి నాగమణికి టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పాల్తేటి పెంటారావు స్వగ్రామం మాడుగుల నియోజకవర్గం కె.కోటపాడు మండలం రామయోగి అగ్రహారం. విద్యార్థి దశ నుంచే దళితుల హక్కుల కోసం పోరాడుతున్నారు. దళిత ఉద్యమాల్లో చురుకైన పాత్ర పోషిస్తున్నారు. గతంలో విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో ఉద్యోగం చేశారు. అప్పట్లో మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శిగా పనిచేశారు. పదవీ విరమణ తరువాత మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. ఈ కార్యక్రమంలో మాడుగుల నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి పైలా ప్రసాదరావు కూడా పాల్గొన్నారు.


చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిన పాల్తేటి పెంటారావు, పక్కన రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు నాగమణి, మాడుగుల టీడీపీ అభ్యర్థి పైలా ప్రసాదరావు

రాంకీ పైపులైన్ పనులను నిలిపివేయాలని తాడి గ్రామస్థుల ఆందోళన

పరవాడ, మార్చి 24: రాంకీ యాజమాన్యం ఫార్మా గ్రీన్‌బెల్ట్ స్థలంలోంచి అక్రమంగా చేపడుతున్న తాగునీటి పైపులైన్ పనులను తక్షణమే నిలిపివేయాలని ఆదివారం స్థానిక ఆలయం వద్ద తాడి గ్రామస్థులు ఆందోళన చేపట్టారు. ఇప్పటికే ఫార్మా కాలుష్యంతో అల్లాడిపోతున్నామని, ఇటువంటి తరుణంలో చెట్లను తొలగించి పైపులైన్ పనులను ఏర్పాటు చేయడం అన్యాయమన్నారు. ఫార్మా కాలుష్య కోరల్లోంచి గ్రామాన్ని తక్షణమే తరలించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మాదంశెట్టి నీలబాబు, మాజీసర్పంచ్ బొడ్డపల్లి అప్పారావు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ, స్థానిక నాయకులు గనిరెడ్డి కనకరాజు, మాధవరావు, కోమటి కులదీప్‌రాజ్, మాదంశెట్టి సూరిబాబు, కోమటి అచ్చిబాబు, అధికసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

చెక్‌పోస్టుల వద్ద సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

▸ జిల్లా అదనపు ఎస్పీ బి. విజయభాస్కర్


సిబ్బందికి సలహాలు, సూచనలిస్తున్న జిల్లా అదనపు ఎస్పీ బి. విజయభాస్కర్

పరవాడ, మార్చి 24: ఎన్నికల నేపథ్యంలో చెక్‌పోస్టుల వద్ద సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని జిల్లా అదనపు ఎస్పీ బి.విజయభాస్కర్ ఆదేశించారు. ఆదివారం అయన దేశపాత్రునిపాలెం పోలీస్ చెక్‌పోస్టును తనిఖీ చేశారు. పోలీస్ సిబ్బంది, కేంద్ర పోలీస్ బలగాలు సంయుక్తంగా వాహన తనిఖీలు నిర్వహించాలన్నారు. అక్రమ రవాణా అరికట్టేందుకు డబ్బు, మద్యం, నాటుసారా, గంజాయి, ఉచిత కానుకలు పంపిణీని నిరోధించేందుకు పటిష్ట తనిఖీలు నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సలహాలు, సూచనలు చేశారు. ఈయన వెంట పరవాడ సీఐ బాలసూర్యారావు ఉన్నారు.

సెజ్ పరిశ్రమల్లో బైక్ దొంగలు

▸ కంపెనీల పార్కింగ్ ప్లేస్‌లో పెట్టిన వాహనం చోరీ
▸ పోలీసులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని బాధితుడి ఆవేదన



వసంత కెమికల్ సెక్యూరిటీ పక్కనే ఉన్న బైక్ స్టాండ్

అచ్యుతాపురం రూరల్, మార్చి 24 : అచ్యుతాపురం, రాంబిల్లి పరిధిలోని సెజ్ కంపెనీలలో బైక్‌లు దొంగతనం జరుగుతున్నాయి. ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోకపోవడంతో దొంగలు చెలరేగిపోతున్నారు. కంపెనీల వద్ద పార్కింగ్ చేసిన బైక్‌లకు రక్షణ లేకుండా పోతున్నది.

రాంబిల్లి పోలీసు స్టేషన్ పరిధిలోని వసంత కెమికల్స్ కంపెనీలో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న అచ్యుతాపురంకు చెందిన మందపల్లి సురేష్ బైక్‌ను పార్క్ చేసి నైట్ డ్యూటీకి లోపలికి వెళ్లాడు. ఉదయాన్నే తిరిగి వచ్చే సరికి బైక్ కనిపించకపోవడం, మరో మూడు బైక్‌ల హ్యాండిల్స్ వంకరపోవడంతో కంపెనీ యాజమాన్యానికి తెలియజేశాడు. కంపెనీ సీసీ కెమెరాను పరిశీలించగా.. ఇద్దరు గుర్తు తెలియని యువకులు రాత్రి సమయంలో కంపెనీ పార్కింగ్‌లోకి ప్రవేశించారు. మధ్యలో పెద్ద కాలువ ఉండడంతో సెక్యూరిటీ గేటు పక్క నుంచి దర్జాగా ఒకడు బైక్ పార్కింగ్‌లో వెళ్లి మూడు బైక్‌ల లాక్‌లను విరగగొట్టడానికి ప్రయత్నించి విఫలమయ్యాడు. చివరగా సురేష్‌కు చెందిన బైక్‌ను సునాయాసంగా విరగగొట్టి తోసుకుంటూ తీసుకు వెళ్లిపోయాడు. సెక్యూరిటీ సిబ్బంది అక్కడ లేకపోవడంతో వారి దొంగతనం సులభమైంది. ఉదయాన్నే సీసీ కెమెరా క్లిప్పింగ్‌తో సురేష్ రాంబిల్లి పోలీసు స్టేషన్‌కు వెళ్లి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశాడు. రిసిప్టు ఇవ్వాలని ఎంత కోరినా కంపెనీ వద్దకు వచ్చి ఇన్వెస్టిగేషన్ చేసిన తర్వాత ఇస్తామని పోలీసులు చెప్పి పంపించేశారు. అప్పటి నుంచీ ప్రతీరోజూ పోలీసు స్టేషన్‌కు వెళ్లడం.. ఏదో చెప్పి పోలీసులు పంపించి వేయడం జరుగుతోంది. పోలీసుల చర్యలతో విసిగిపోయిన సురేష్ గత సోమవారం అనకాపల్లి ఎస్పీ కార్యాలయంలో జరిగే స్పందనలో ఫిర్యాదు చేయడానికి వెళ్లాడు. స్పందన తీసేశామని, ఫిర్యాదులు స్వీకరించడం లేదని తిరిగి పంపించేశారు. పోలీసులు పట్టించుకోకపోతే దొంగలు ఇష్టారాజ్యంగా మారిపోతారనే ఆందోళన చెందే పరిస్థితి నెలకొంది. బైక్‌ను దొంగలు నడిపించుకుంటూ వెళ్లిపోవడంతో సమీప ప్రాంతంలోనే బైక్ ఉన్నట్టు అనుమానిస్తున్నాడు. పోలీసులు దృష్టి సారిస్తే బైక్ దొరుకుతుందని బాధితుడు సురేష్ అంటున్నాడు. దొంగతనం జరిగి 20 రోజులైనా ఇంకా తమ కంపెనీకి వచ్చి ఎంక్వయిరీ జరపలేదు సరికదా.. తన ఫిర్యాదుకు రిసిప్టు ఇవ్వకపోవడంపై సురేష్ అసహనం వ్యక్తం చేస్తున్నాడు. ఈ విషయమై రాంబిల్లి సర్కిల్ సీఐ లక్ష్మణరావును వివరణ కోరగా.. బైక్ అపహరణ సంఘటనపై క్రైమ్ టీమ్‌కు సమాచారం ఇచ్చామన్నారు. ఇప్పటికే వసంత కెమికల్ కంపెనీకి రెండు సార్లు వెళ్లి, సీసీ కెమెరాలను పర్యవేక్షించి ప్రాథమిక సమాచారం తెలుసుకున్నట్టు తెలిపారు. త్వరలో బైక్ దొంగలను పట్టుకుంటామన్నారు. ఆయా కంపెనీల పరిసరాలలో గట్టి నిఘా ఏర్పాటు చేశామన్నారు.

ఆ యువకుడిపై చర్యలు తీసుకోండి

▸ పోలీసులకు ఫిర్యాదు చేసిన ధర్మవరం అగ్రహారం పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్
▸ ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఎస్. రాయవరం, మార్చి 24: మండలంలోని ధర్మవరం అగ్రహారం జిల్లా పరిషత్ పాఠశాల పదో తరగతి పరీక్ష కేంద్రం ప్రహరీ గోడ దూకి ప్రవేశించిన యువకుడిపై చర్యలు తీసుకోవాలని ఎస్. రాయవరం పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేసినట్టు పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ పిల్లా శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం టెన్త్ పరీక్షా కేంద్రం వద్ద హల్‌చల్ శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు వెనువెంటనే స్పందించారు. దీనికి సంబంధించి పరీక్షా కేంద్రం సూపరింటెండెంట్ శ్రీనివాసరావు మాట్లాడుతూ గోడ దూకి పరీక్షా కేంద్రం వద్దకు స్లిప్పుతో వచ్చిన యువకుడు ఎవరనేది గుర్తించి, చర్యలు తీసుకోవాలని, అలాగే పరీక్షా కేంద్రం వద్ద పోలీసు బందోబస్తు పెంచాలని కోరినట్టు చెప్పారు.

క్షయ వ్యాధి పట్ల అప్రమత్తత అవసరం

▸ జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ బాలాజీ

అనకాపల్లి టౌన్, మార్చి 24 : క్షయ వ్యాది పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తతతో ఉండాలని జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ ఎంవీఎస్ బాలాజీ పిలుపునిచ్చారు. ఆదివారం ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవం సందర్భంగా డీఎల్‌వో కార్యాలయంలో జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ చికిత్సతో క్షయవ్యాధిని పూర్తిగా నివారించవచ్చన్నారు. వారం రోజుల పైబడి దగ్గుతో బాధపడుతున్న వారు పరీక్ష చేయించుకోవాలన్నారు. అనంతరం ఆరోగ్య సిబ్బంది, నర్సింగ్ విద్యార్థులతో కలిసి నిర్వహించిన ర్యాలీని డాక్టర్ బాలాజీ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో వైద్యులు, వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభించిన డాక్టర్ బాలాజీ

సంపద కేంద్రాల నిర్వహణపై కదిలిన పంచాయతీ కార్యదర్శులు

కోటవురట్ల, మార్చి 24: మండలంలో గొట్టివాడ, జగ్గంపేట గ్రామాల్లో సంపద కేంద్రాలు నిర్వహణపై పంచాయతీ కార్యదర్శులు స్పందించారు. మండలంలో సంపద తయారీ కేంద్రాలు నిర్వహణ గాలి కొదిలేసిన అధికారుల నిర్లక్ష్యంపై ఈనెల 21వ తేదీన 'చెత్త శుద్ధి లేదాయె' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై డీపీవో శిరీషారాణి, ఈవోపీఆర్‌డీ స్వామినాయుడు స్పందించారు. అధికారుల ఆదేశాల మేరకు గొట్టివాడ పంచాయతీలో రోడ్డుపక్కన చెత్తను ఎక్స్‌కవేటర్‌తో తొలగించగా.. టి. జగ్గంపేట సంపద కేంద్రాన్ని పంచాయతీ కార్యదర్శులు వినియోగంలోకి తీసుకువచ్చారు.


ఆంధ్రజ్యోతి ఎఫెక్టు
జగ్గంపేట సంపద కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకొస్తున్న కార్యదర్శి



సమావేశంలో మాట్లాడుతున్న సాంబశివరావు

కార్మిక సమస్యలపై నిత్య పోరాటం

▸ తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘం అధ్యక్షుడు సాంబశివరావు

సీలేరు, మార్చి 24: కార్మికుల సమస్యలపై నిత్యం పోరాటం చేయాల్సిందేనని తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘం అధ్యక్షుడు పి.సాంబశివరావు పిలుపునిచ్చారు. సీలేరు ఏపీ జెన్‌కో కల్యాణ మండపంలో ఆదివారం తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ రంగంలో కార్మికుల సమస్యలపై దశల వారీగా యాజమాన్యాలకు ఎన్నిసార్లు వినతిపత్రాలు ఇస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం వల్ల విద్యుత్ రంగం నిర్వీర్యమైందన్నారు. రాబోయే రోజుల్లో విద్యుత్ రంగానికి మంచి రోజులు వస్తాయని భావిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుగుణాకరరావు మాట్లాడుతూ వేతన సవరణపై ప్రభుత్వం దృష్టిసారించాల్సిందేనని, అలవెన్సుల విషయంలో కూడా ప్రభుత్వం మొండివైఖరిని విడనాడాలని డిమాండ్ చేశారు. గతంలో మాదిరిగా ప్రతీ నెల ఒకటో తారీఖున జీతాలు, పింఛన్లు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు మధుసూదనరెడ్డి, అదనపు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీరామమూర్తి, రాష్ట్ర కోశాధికారి కోగంటి వెంకటేశ్వరరావు, ప్రాంతీయ నాయకులు భాస్కరరావు, వరప్రసాద్, అప్పారావు, విశ్రినాథ్, రఘురాజు, విద్యుత్ రంగం జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు, జెన్‌కో నాయకులు పాల్గొన్నారు.

మోదకొండమ్మ ఆలయానికి భక్తుల తాకిడి



ఆలయంలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పాడేరు రూరల్, మార్చి 24: స్థానిక మోదకొండమ్మ ఆలయానికి ఆదివారం సైతం భక్తుల తాకిడి తగ్గలేదు. ఏజెన్సీలో నుంచే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు కమిటీ ప్రతినిధులు ప్రసాదాలను పంపిణీ చేశారు.

నేడు సంగోడిలో శివలింగం ప్రతిష్ఠ



ప్రారంభోత్సవానికి సిద్ధమైన శివాలయం

పాడేరు రూరల్, మార్చి 24: మండలంలో మినుములూరు పంచాయతీ సంగోడి గ్రామంలో నిర్మించిన శివాలయాన్ని సోమవారం ఉదయం ప్రారంభోత్సవం, శివలింగ ప్రతిష్ఠకు ఆలయ కమిటీ ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ సందర్భంగా గత రెండు రోజులుగా శివాలయం ప్రాంగణంలో వివిధ ప్రత్యేక పూజలు, హోమాలను నిర్వహిస్తున్నారు. ఆలయ ప్రారంభోత్సవం, శివలింగ ప్రతిష్ఠ క్రతువును విశాఖ శారద పీఠాధిపతి స్వరూపానందేంద్రస్వామి చేతుల మీదుగా నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేయాలని ఆలయ కమిటీ ప్రతినిధులు కోరారు.

క్షయ నివారణపై అవగాహన ర్యాలీ



సీలేరులో ర్యాలీ చేస్తున్న వైద్యులు, వైద్య సిబ్బంది

సీలేరు, మార్చి 24: క్షయ వ్యాధి నివారణపై ఆదివారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి కె.సౌమ్య ఆధ్వర్యంలో ఆదివారం వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు స్థానిక పీహెచ్‌సీ నుంచి సీలేరు పురవీధుల్లో ఈ ర్యాలీ సాగించారు. క్షయ వ్యాధిని తరిమికొడదామన్న నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మార్కెట్ సెంటర్‌లో మానవహారంగా ఏర్పడి క్షయ వ్యాధిపై స్థానికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి సౌమ్య మాట్లాడుతూ మూడు వారాల పాటు ఎవరికైనా దగ్గు వస్తే వెంటనే పీహెచ్‌సీకి వచ్చి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. క్షయ వ్యాధి నిర్ధారణ జరిగితే ప్రభుత్వ ఆసుపత్రిలోనే ఉచితంగా మందులు సరఫరా చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు పిల్లా సాంబమూర్తి, ఆరోగ్య విస్తరణాధికారి జోజిబాబు, హెల్త్ అసిస్టెంట్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కేజ్రీవాల్ అరెస్టు దుర్మార్గం



విక్టరీ సింబల్ చూపిస్తున్న ఆప్ నాయకులు

జి.మాడుగుల, మార్చి 24: ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అరెస్టు దుర్మార్గమైన చర్య అని పాడేరు ఆమ్‌ఆద్మీ పార్టీ ఇన్‌చార్జి సొనాయి గంగరాజు ఆరోపించారు. ఆ పార్టీ మహిళ విభాగం నాయకురాలు లక్ష్మి గంగరాజుతో కలిసి ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ఇండియా కూటమిలో ఉన్న బలమైన పార్టీలనను మోదీ ప్రభుత్వం అవినీతి మరకలతో తొక్కేసే కుట్రలో భాగంగానే ఢిల్లీ సీఎంను అరెస్టు చేశారని విమర్శించారు. వారి వెంట విద్యార్థి సంఘాల నేతలు ఉన్నారు.

ఏపీఆర్ఎస్‌లో సీట్ల భర్తీకి దరఖాస్తులు

నర్సీపట్నం, మార్చి 24 : ఇక్కడి ఏపీ రెసిడెన్షియల్ స్కూల్‌లో ఐదో తరగతి ప్రవేశాలు, ఆరు, ఏడు, ఎనిమిది తరగతుల్లో మిగుల సీట్లు భర్తీకి ఆన్‌లైన్‌లో ఈ నెలాఖరులోగా దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా ప్రిన్సిపాల్ రాజేంద్ర ప్రసాద్ కోరారు. ఏప్రిల్ 17 తేదీన హాల్‌టిక్కెట్లు మంజూరు, 25వ తేదీన పరీక్ష ఉంటుందని వివరించారు. పూర్తి వివరాలకు స్కూల్‌లో సంప్రదించాల్సిందిగా కోరారు.

బి.శింగవరం.. సమస్యలదే రాజ్యం!

▸ కనీస సదుపాయాలకు నోచుకోని గ్రామం

▸ అనారోగ్యం చేస్తే డోలిమోతలే శరణ్యం

▸ భయాందోళనతో కాలం వెల్లదీస్తున్న గిరిజనం

కొయ్యూరు, మార్చి 24: బూదరాళ్ల పంచాయతీ పరిధిలోని బి.శింగవరం గ్రామంలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. కనీస మౌలిక వసతులు కరవయ్యాయి. గ్రామంలో అభివృద్ధి ఛాయలు మచ్చుకైనా కానరావడం లేదు. దీంతో గిరిజనులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

బి.శింగవరం గ్రామంలో సుమారు 50 కుటుంబాలకు చెందిన 235 మంది జనాభా నివసిస్తున్నారు. ఈ గ్రామం అధికారులకు, పాలకులకు పట్టకపోవడంతో కనీస అభివృద్ధికి నోచుకోవడం లేదు. స్వాతంత్ర్యం సిద్ధించి ఏడు దశాబ్దాలు దాటినా గ్రామంలో విద్యుత్ సక్రమంగా సరఫరా చేయడం లేదు. దీంతో ఏడాది పొడవునా అంధకారంలోనే మగ్గాల్సిన దుస్థితి దాపురించింది. అలాగే గ్రామానికి రహదారి సదుపాయం



కలుషిత ఊట నీటిని పట్టుకుంటున్న తూములోవ మహిళలు



రాళ్లు తేలిపోయిన బూదరాళ్ల-తూములోవ ప్రధాన రహదారి

కల్పించలేదు. దీంతో అత్యవసర పరిస్థితిలోనైనా గ్రామం నుంచి వైద్య సేవలకు తరలించడానికి సుమారు ఆరు కిలోమీటర్లు మేర దట్టమైన అటవీ ప్రాంతంలో డోలీమోత లతో బాధితులను తరలిస్తున్నారు బూదరాళ్ల వరకు గ్రావెల్ రోడ్డు వేసే అవకాశం ఉన్నా, ఆ దిశగా చర్యలు లేక దట్టమైన అటవీ ప్రాంతం నుంచి కాలిబాటన వెళ్లాల్సి వస్తోంది. గ్రామానికి నేటికీ తాగునీటి వసతి లేదు. దీంతో గ్రామానికి కిలోమీటరు దూరంలో గల



కనీస సదుపాయాలకు నోచుకోని బి.శింగవరం గ్రామం ఇదే...

రెండు బండరాళ్ల మధ్య నుంచి పారే ఊటనీరే గతి. గ్రామంలో బాలింతలు, గర్భినులు, చిన్నారులకు పౌష్టికాహారం అందించే దిశగా అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు లేదు. ఇక్కడ నుంచి పౌష్టికాహారం కోసం సుమారు ఆరు కిలోమీటర్లు దూరం బూదరాళ్ల గ్రామానికి వెళ్లాల్సి వస్తోంది. ఇక గ్రామంలో బడి ఈడు పిల్లలు సుమారు 15 మంది వరకు ఉన్నా పాఠశాల లేదు. దీంతో వీరు బూదరాళ్ల వెళ్లి చదుకోవాల్సిన పరిస్థితి. వైద్య సేవలు కూడా అంతంతమాత్రమే. ఈ గ్రామంలోని సమస్యలపై పాలకులకు, అధికారుల ప్రత్యేకంగా దృష్టిసారించాలని కోరుతున్నారు.

అపరిచితుల హల్‌చల్

▸ ముంచంగిపుట్టులో కొద్ది రోజులుగా సంచారం

▸ గిరి గ్రామాల్లో రాత్రి వేళల్లో యువకుల పహారా

▸ అపరిచిత వ్యక్తుల కదలికలపై పోలీసుల దృష్టి

ముంచంగిపుట్టు, మార్చి 24: మండలంలో అపరిచిత వ్యక్తులు హల్‌చల్ చేస్తున్నారు. కొద్ది రోజులుగా రాత్రి వేళల్లో పలు గ్రామాల్లోని ఇళ్ల తలుపులు కొట్టడం, పలుచోట్ల దొంగతనాలు, దారి దోపిడీలు చేస్తుండడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు.దీంతో గిరి గ్రామాల్లో యువకులు అప్రమత్తమయ్యారు. ఇటీవల మాకవరంలో దొంగలు తుపాకులు, కత్తులతో ఒక ఇంటిలోకి చొరబడి భారీ చోరీకి పాల్పడిన విషయం తెలిసిందే. అలాగే మండల కేంద్రంలో పలు దుకాణాలు, ఇళ్లలో పలు దొంగతనాలు జరిగాయి. అలాగే రాత్రి వేళల్లో అపరిచిత వ్యక్తులు సంచరిస్తూ ఇంటి తలుపులు, గేట్లను తడుతున్నారని స్థానికులు అంటున్నారు. అదును దొరికితే దొంగతనం చేసేందుకే అపరిచిత వ్యక్తులు గ్రామాల్లోని శివారు ఇళ్లను టార్గెట్ చేసుకుంటున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజూ ఏదో ఒక గ్రామంలో ఇద్దరు ముగ్గురు అపరిచిత వ్యక్తులు గత కొద్ది రోజులుగా రాత్రి పూట అలజడులు చేయడం, స్థానికులకు మెలుకవ వచ్చి కేకలు వేస్తే పారిపోవడం జరుగుతోంది.

దీంతో గిరి గ్రామాల్లో రోజుకు కొంత మంది చప్పున యువకులు రాత్రి నుంచి ఉదయం వరకు పహారా కాస్తున్నారు. అనుమానాస్పదంగా రాత్రి వేళ ఎవరు సంచరించినా ప్రశ్నించి విడిచి పెడుతున్నారు. గత శుక్రవారం రాత్రి మండల కేంద్రంలో రాత్రి సమయంలో గుర్తి తెలియని వ్యక్తులు ఒక ఇంటి గేటుకు గడియపెట్టి తలుపును కొట్టారు. వారు అప్రమత్తమై కేకలు వేయడం, స్థానికులు అక్కడికి చేరుకోవడంతో అక్కడ నుంచి పరారీ అయ్యారు. ఇలా తరచూ మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో జరుగుతోంది. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి మండల కేంద్రంలో పోలీసులు, స్థానికులు రాత్రి నుంచి తెల్లవారు జాము వరకు పహారా కాశారు. అలాగే మినుములపుట్టు, కొత్త సుజనకోట, పాత సుజనకోట, కిలగాడ, దాసరిపుట్టు, కించాయిపుట్టు, బరడ, లక్ష్మీపురం,



ముంచంగిపుట్టులో రాత్రి పహరా కాస్తున్న యువకులు

రంగబయలు, బాబుసాల తదితర పంచాయతీల్లో రోజుకు కొంత మంది యువకులు గస్తీ నిర్వహిస్తున్నారు. అయితే దొంగతనాలు, దారి దోపిడీలు తగ్గుముఖం పట్టేవరకు తమ గ్రామాలకు రాత్రి వేళల్లో బయట వ్యక్తులు ఎవరూ రావద్దని విజ్ఞప్తి చేస్తున్నారు.

అనుమానాస్పద వ్యక్తుల సమాచారం ఇవ్వండి

అనుమానాస్పద వ్యక్తులు ఎక్కడైనా సంచరిస్తున్నట్టు తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్ఐ కె.రవీంద్ర కోరారు. గ్రామాల్లో దొంగతనాలు జరగకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. దొంగతనాల భయంతో గ్రామాలకు బయట వ్యక్తులు వస్తే ఎటువంటి దాడులు చేయవద్దని, వారి వివరాలను తెలుసుకొని అనుమానాస్పదంగా భావిస్తే పోలీసులకు సమాచారం అందించాలని ఆయన కోరారు.





సీలేరు యూసీఐఎం చర్చి ఆధ్వర్యంలో మట్టల నిర్వహిస్తున్న దృశ్యం... సీలేరులో ర్యాలీ చేస్తున్న వైద్యులు, సిబ్బంది

ఘనంగా 'మట్టల ఆదివారం'

డుంబ్రిగుడ, మార్చి 24: మండలంలో ఈత మట్టల ఆదివారం ఘనంగా జరిగింది. డుంబ్రిగుడ, కించుమండ, గుంటసీమ, అరకు గ్రామాల్లో క్రైస్తవ సోదరులు ప్రత్యేక ప్రార్థనలను నిర్వహించారు. డుంబ్రిగుడ గ్రామంలో చిన్నారులు ఈత మట్టలకు పూలాంకరణ చేసి పురవీధుల మీదుగా భక్తి గీతాలను ఆలపిస్తూ ఊరేగింపును చేపట్టారు. ఈత మట్టల ఆదివారాన్ని పురస్కరించుకుని సియోను, యూసీఐఎం ప్రార్థన మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలతో క్రైస్తవులు ఘనంగా నిర్వహించారు. చిన్నారులు తెల్లటి దుస్తులను ధరించి ఈత మట్టల ఊరేగింపులో సందడి చేశారు.

సీలేరులో...

సీలేరు: సీలేరులో యూసీఐఎం చర్చి ఆధ్వర్యంలో మట్టల ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈస్టర్‌కు ముందు వచ్చే ఆదివారాన్ని ప్రతీ ఏటా క్రైస్తవులు మట్టల ఆదివారంగా నిర్వహిస్తారు. ఈ క్రమంలోనే స్థానిక యూసీఐఎం చర్చి పాస్టర్ మనస్సే ఆధ్వర్యంలో ఉదయం నుంచి చర్చిలో ప్రత్యేక ప్రార్థనలను నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులతో ఏసుక్రీస్తు వేషధారణ వేయించి, ఈత కొమ్మలను చేతబూని సీలేరు పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు.

అరకులోయ ఎంపీ అభ్యర్థి కొత్తపల్లి గీత

... 5వ పేజీ తరువాయి

జిల్లా ఎన్నికల ఇన్‌చార్జిగా పని చేశారు. తరువాత టీడీపీ కేంద్ర కమిటీ సభ్యుడిగా బాధ్యతలు చేపట్టారు. 2009లో టీడీపీ ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. టీడీపీ తరపున 2012లో రాజ్యసభ సభ్యుడి ఎన్నికయ్యారు. ఇదే సంవత్సరం కడప జిల్లాలో విద్యుత్ కోతలు, సాగునీరు, తాగునీరు సమస్యలు, సిమెంట్ ధర తగ్గించాలని కోరుతూ నిరవధిక నిరాహారదీక్ష చేపట్టారు. 2018లో రెండోసారి టీడీపీ తరపున రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికయ్యారు. గత సాధారణ ఎన్నికల తరువాత సహచర రాజ్యసభ సభ్యులు సుజనా చౌదరి, టీజీ వెంకటేశ్‌తో కలిసి బీజేపీలో చేరారు.

అప్పటి నుంచి బీజేపీలోనే కొనసాగుతున్నారు. పలు పార్లమెంటరీ కమిటీల్లో సభ్యుడి పనిచేశారు. పొత్తులో భాగంగా అనకాపల్లి ఎంపీ స్థానం బీజేపీకే కేటాయించడంతో సీఎం రమేశ్ ఇక్కడి నుంచి పోటీ చేయడానికి అధిష్ఠానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కాగా ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయడం రమేశ్‌కు ఇదే తొలిసారి.

జనసేన అభ్యర్థుల ఖరారు

పెందుర్తికి పంచకర్ల, ఎలమంచిలికి సుందరపు

పెండింగ్‌లో విశాఖ దక్షిణ నియోజకవర్గం

విశాఖపట్నం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): పొత్తులో భాగంగా ఉమ్మడి విశాఖ జిల్లాలో జనసేన పార్టీకి కేటాయించిన నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాలకుగాను మరో రెండు నియోజకవర్గాలకు అభ్యర్థులను పార్టీ అధిష్ఠానం ఆదివారం ప్రకటించింది.

అనకాపల్లి నుంచి కొణతాల రామకృష్ణ పేరును మొదటి జాబితాలోనే వెల్లడించగా, తాజాగా విడుదల చేసిన మరో జాబితాలో పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పంచకర్ల రమేశ్‌బాబు, ఎలమంచిలి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి సుందరపు విజయకుమార్‌లకు చోటు దక్కింది. విశాఖ దక్షిణం సీటును పెండింగ్‌లో పెట్టారు.

అవయవదాతల కోసం ఎదురుచూపులు

... 5వ పేజీ తరువాయి

ఈ సమస్యలు పెరుగుతున్నాయి. ఆహార అలవాట్లు, ఆల్కహాల్, స్మోకింగ్ వంటి దురలవాట్ల కారణంగా బాధితులు పెరుగుతున్నారు. వీరిలో చాలా మందికి చిన్న వయసులోనే అవయవాలు డ్యామేజ్ అవుతున్నాయి. దీర్ఘకాలం చికిత్స అందించినా ప్రయోజనం లేకపోవడంతో అవయవ మార్పిడి శస్త్రచికిత్స చేయాల్సి వస్తోంది. ఈ తరహా శస్త్రచికిత్సలు అవసరమవుతున్న వారిలో దాదాపు 50 శాతం మంది 40 ఏళ్లలోపు వారే కావడం ఆందోళన కలిగిస్తోంది.

దాతల కోసం ఎదురుచూపులు

ఎంతోమంది బాధితులకు కుటుంబసభ్యుల ఆర్గాన్స్ సరిపడక అవయవదాతలు కోసం ఎదురు చూడాల్సి వస్తోంది. 2015 నుంచి 2019 వరకు లివర్ కోసం 1,010 మంది రోగులు దరఖాస్తు చేసుకోగా, కిడ్నీ కోసం 2,325 మంది, గుండె మార్పిడి కోసం 62 మంది, ఊపిరితిత్తుల మార్పిడి కోసం 12 మంది ఎదురు చూస్తున్నారు. వీరి బ్లడ్ గ్రూపు, ఇతర వైద్య పరమైన అంశాలు సరిపడిన తరువాత బ్రెయిన్‌డెడ్ అయిన వారి నుంచి సేకరించిన అవయవాలను జీవన్‌ధాన్‌లో రిజిస్టర్ చేసుకున్న వారి జాబితా ప్రకారం అందిస్తారు.

రెండు రకాలుగా అవయవదానం

అవయవమార్పిడి శస్త్ర చికిత్సలను రెండు విధాలుగా చేస్తారు. వీటిలో ఒకటి కెడావర్, రెండోది లైవ్. కెడావర్ అంటే ప్రమాదవశాత్తు తీవ్రంగా గాయపడిన వ్యక్తి బతికే చాన్స్ లేద ని (బ్రెయిన్ డెడ్) వైద్యులు నిర్ధారించిన తరువాత కుటుంబ సభ్యుల సమ్మతి మేరకు చేయడం. 2015 నుంచి 2019 వరకు కెడావర్ ట్రాన్స్‌ప్లాంటేషన్‌లో భాగంగా 457 మందికి కిడ్నీ మార్పిడి, 192 మందికి లివర్, 73 మందికి హార్ట్, 92 మందికి లంగ్స్, ఒకరికి పాంక్రియాస్ మార్పిడి శస్త్రచికిత్సలను చేశా రు. లైవ్ ట్రాన్స్‌ప్లాంటేషన్ అంటే బతికి ఉండగానే కొన్ని అవ యవాలను దానం చేసే అవకాశముంది. కుటుంబ సభ్యులకు, దగ్గరి బంధువులకు కొన్ని అవయవాలు దానం చేయవచ్చు. దీన్ని లైవ్ ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంటేషన్ అంటారు. ఇందుకోసం లివర్‌లో నాలుగో వంతు, కిడ్నీలో ఒకటి, బోన్ మ్యారో వంటివి ఇవ్వవచ్చు. గడిచిన తొమ్మిదేళ్లలో లైవ్ ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంటే షన్స్ అధికంగా జరిగాయి. వీటిలో కిడ్నీ 2,498 మందికి, లివర్ 30 మందికి మార్పిడి చేశారు.

అవగాహనతోనే ముందుకు

గతంతో పోలిస్తే కెడావర్ ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంటేషన్స్ పెరి గాయి. ప్రమాదాల్లో బ్రెయిన్‌డెడ్‌గా నిర్ధారణ అయిన వారి అవయవాలు అందించేందుకు ఎక్కువ మంది ముందుకు వస్తుండడంతో దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల జీవితాల్లో వెలుగులు ప్రసరిస్తున్నాయి. అవయవ దానిపై స్వచ్ఛంద సంస్థలు ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాయి.

తాజంగి కేజీబీవోలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

చింతపల్లి, మార్చి 24: తాజంగి కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో ఆరో తరగతి, ఇంటర్ ప్రవేశాలకు అర్హులైన విద్యార్థినుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ కోటి సుమమాధురి తెలిపారు. ఆదివారం స్థానిక విలేకరులతో ఆయు మాట్లాడుతూ ఆరో తరగతిలో 40 సీట్లు, ఇంటర్మీడియేట్ ఎంఈసీ గ్రూప్‌లో 30 సీట్లు ఉన్నాయన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.2 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.1.4 లక్షలకు మించి వార్షిక ఆదాయం ఉండరాదన్నారు. ప్రస్తుతం ఐదో తరగతి చదువుతున్న విద్యార్థినులు ఆరో తరగతికి, పదోవ తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థినులు ఇంటర్మీడియేట్‌లో ప్రవేశం పొందేందుకు ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇందుకోసం విద్యార్థిని, తల్లిదండ్రుల ఆధార్ కార్డులు, స్టడీ, కులం, రేషన్ కార్డు, పాస్‌పోర్టు సైజ్ ఫొటో, ఫోన్ నంబరు ఉండాలని చెప్పారు.

రంప టీడీపీ టికెట్ వివాదం ముగిసినట్టేనా?

రంపచోడవరం, మార్చి 24: రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీలో చోటు చేసుకున్న టికెట్ వివాదం ముగిసి ముగ్గురు మాజీ ఎమ్మెల్యేలు, వారి వర్గాలు అధిష్ఠాన నిర్ణయమే శిరోధార్యమన్న ఏకాభిప్రాయానికి వచ్చినట్టే కనిపిస్తోంది. శనివారం విజయవాడలో జరిగిన పార్టీ అభ్యర్థుల సదస్సుకు అభ్యర్థి మిరియాల శిరీషాదేవిని ఆహ్వానించడం, అదే రోజు మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరితో చంద్రబాబు భేటీ అయిన నేపథ్యంలో చంద్రబాబు రాజీ కుదుర్చారనే సంకేతాలు వెలువడ్డాయి. సదస్సులో అభ్యర్థులకు ఎన్నికల్లో ఎలా వ్యవహరించాలన్న దిశానిర్దేశం చేసిన చంద్రబాబు అభ్యర్థి శిరీషా దేవి సూచనల మేరకు ఆమె సూచించిన వారికి పలు కమిటీల్లో స్థానం కల్పించారు. మరో పక్క రాజేశ్వరితో మాట్లాడిన చంద్రబాబు పార్టీ అండగా ఉంటుందని, తగిన విధంగా న్యాయం చేస్తుందని చెప్పినట్లు సమాచారం. రంపచోడవరం నియోజకవర్గంలో కూటమి విజయం సాధించే దిశగా సమన్వయంతో పనిచేయాల్సిన అవసరాన్ని చంద్రబాబు నేతలకు చెప్పడంతో వారి కొంచెం మెత్తబడి పార్టీ విజయం కోసం పనిచేస్తామనే ధోరణి కనబరుస్తున్నట్లు తెలుస్తోంది. కొద్ది రోజుల్లోనే ఇక్కడి పరిస్థితులు పూర్తిగా చక్కబడతాయని, పార్టీకి వెన్నంటి ఉన్న ముఖ్యనేతలందరికీ చంద్రబాబు తగు న్యాయం చేసే విధంగా యోచిస్తున్నారని తటస్థంగా ఉండే పార్టీ సీనియర్లు స్పష్టం చేస్తున్నారు.

అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించాలి

రంపచోడవరం, మార్చి 24: ఏజెన్సీలో గిరిజనులు సేకరిస్తున్న అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు కల్పించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ప్రగతిశీల మహిళా సంఘం నాయకురాలు మడకం జోగమ్మ అన్నారు. మార్క్స్-ఏంగిల్స్ భవనంలో ఆదివారం ఆమె అధ్యక్షతన డివిజన్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవోడబ్ల్యూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పి.అనసూయ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ప్రజల సమస్యలను పరిష్కరించే నాయకులను ఎన్నుకోవాలని, ప్రజల కోసం నిస్వార్థంగా పని చేస్తున్న విప్లవ పార్టీల అభ్యర్థులను గెలిపించాలన్నారు.

వ్యవసాయ ఆధారిత పరిశ్రమలపై వర్క్‌షాపు

నర్సీపట్నం, మార్చి 24 : వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేయాలనుకునే ఔత్సాహికుల కోసం ఖాదీ, గ్రామీణ పరిశ్రమల కమిషన్ ఆధ్వర్యంలో సోమవారం ఇక్కడ వర్క్‌షాప్ నిర్వహించనున్నారు. ఉదయం పది గంటలకు శారదానగర్‌లోని వేదిక ఫంక్షన్ హాల్‌లో ప్రారంభం కానున్న ఈ సదస్సును సద్వినియోగం చేసుకోవాల్సిందిగా వేములపూడి ఖాదీ సొసైటీ అధ్యక్షుడు వెంకటరమణ కోరారు.